మెదక్ చర్చికి సీఎం రేవంత్ రావడంతో భక్తులను బయటకు తోసేస్తున్న పోలీసులు

ముఖ్యమంత్రి కోసం
దర్శనానికి 3 గంటలపాటు బ్రేక్

మెదక్ చర్చి వద్ద భక్తుల ఇబ్బందులు

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : మెదక్ చర్చి వందేళ్ల ఉత్సవాలు, క్రిస్మస్ పండుగ కలిసి రావడంతో బుధవారం లక్షలాది మంది భక్తులు చర్చిలో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11.45 గంటలకు మెదక్ చర్చి ప్రాంగణంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. 12 గంటలకు ప్రార్థనలో పాల్గొనాలి. కానీ రెండు గంటల పాటు ఆలస్యంగా రావడంతో చర్చికి వచ్చిన భక్తులు బయటే వేచి ఉండాల్సి వచ్చింది. ఏసు కంటే సీఎం ఎక్కువ కాదని క్యూలో నిల్చున్న భక్తులు వాపోయారు. క్రిస్మస్ రోజు పిల్లాపాపలతో ఎక్కడి నుంచో మెదక్ చర్చికి వస్తే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని చీదరించుకున్నా రు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎప్పు డూ ఇలా జరగలేదని మహిళలు వాపోయారు. సీఎం వచ్చి వెళ్లేంతవరకు పోలీసులు భక్తులను చర్చి లోపలికి రానివ్వకుండా అడ్డుకోవడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రేవతి కుటుంబానికి 2కోట్ల సాయం

దిల్‌రాజు ద్వారా చెక్కు అందించిన అరవింద్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబానికి అల్లు అర్జున్, పుష్ప సినిమా నిర్మాతలు రూ.2 కోట్లు సాయం అందించారు. అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్, పుష్ప-2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి బుధవారం కిమ్స్‌లో చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. రూ.1.5 కోట్ల చెక్కును ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్ రాజుకు అందించారు. అనంతరం అల్లు అరవింద్ మాట్లాడుతూ అల్లు అర్జున్ తరపున రూ.కోటి, దర్శకుడు సుకుమార్ రూ.50 లక్షలు, మైత్రీ మూవీ మేకర్స్ తరపున రూ.50లక్షలు అందించినట్టు తెలిపారు. ఇప్పటికే ఇందులో మైత్రీ మూవీస్ రూ.50లక్షల చెక్కును రేవతి భర్త భాస్కర్‌కు అందించినట్టు వివరించారు. బాధితుడికి నేరుగా సాయం అందిస్తే న్యాయపరమైన సమస్యలు వస్తాయని, అందుకే బాధితుడిని నేరుగా కలవలేకపోతున్నానని ఎఫ్‌డీసీ ద్వారా సాయం అందించినట్టు చెప్పారు. శ్రీతేజ్ త్వరగా కోల్కొంటున్నాడని తెలిపారు. వెంటిలేషన్ తీసేశారని వివరించారు. బాలుడు శ్రీతేజ్ ఆరోగ్యం మెరుగుపడిందని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు చెప్పారు. అతడి పరిస్థితి బాగుందని వైద్యులు తెలిపినట్టు పేర్కొన్నారు. అల్లు అరవింద్ అందించిన సాయం రేవతి కుటుంబానికి అన్ని విధాల ఉపయోగపడేలా చూస్తామని తెలిపారు.

సమాచార 'హక్కు' లేనట్టేనా?

రాష్ట్రంలో 22 నెలలుగా లేని ఆర్టీఐ కమిషనర్లు • అతీగతీ లేని షార్ట్ లిస్ట్

కరువైన సర్కార్ స్పందన • 20 వేలకుపైగా పిటిషన్లు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ): 'రాష్ట్రంలో ప్రజలకు సమాచార 'హక్కు' ఉన్నట్టా? లేనట్టా?' ఆర్టీఐ కమిషన్ కార్యాలయానికి రోజుల తరబడి వచ్చిపోయే వారి ప్రశ్న ఇది. 22 నెలలుగా ఆర్టీఐ ప్రధాన కమిషనర్, కమిషనర్ పోస్టులు భర్తీకాలేదు. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది దాటినా నియామకాలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సమాచార హక్కు కమిషన్ ఏర్పాటు విషయంలో న్యాయస్థానాల తీర్పులను సైతం కాంగ్రెస్ సర్కార్ పక్కనపెట్టింది. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి నెలలు గడిచినా అడుగు ముందుకు పడటమే లేదు. సమాచార హక్కు కమిషనరేట్‌లో ఏ ఒక్క కమిషనర్ లేక దరఖాస్తులు పేరుకుపోతుండగా, అర్జీదారులు ఆర్టీఐ ఆఫీసు చుట్టూ తిరిగి ఉత్తచేతులతో మళ్లిపోతున్నారు. నాడు ప్రతిపక్షంలో ఎంపీగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఆర్టీఐ యాక్ట్‌పై గంభీర ప్రకటనలు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సీఎం అయి ఏడాది గడిచినా అదే సమాచార హక్కు కమిషనర్‌ల నియామకాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని సామాన్యుడు సైతం ప్రశ్నిస్తున్నాడు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కమిషనర్‌తోపాటు కమిషనర్లను నియమిస్తామంటూ రేవంత్‌రెడ్డి చేసిన హామీలు ఏమయ్యాయయని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇదేనా ప్రజాపాలన?

కమిషనర్ల పదవీకాలం 2023 ఫిబ్రవరి 24న ముగిసింది. 22 నెలలుగా సమాచార హక్కు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. కమిషనర్లు లేక దాదాపు 20 వేలకు పైగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర సమాచార కమిషనర్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారికి 'మా చేతుల్లో ఏమున్నది?' అన్న సమాధానం ఆర్టీఐ కమిషనరేట్ సిబ్బంది నుంచి ఎదురవుతున్నది. దీంతో ఇదేనా ప్రజాపాలన? అని అర్జీదారులు నిర్వేదం వ్యక్తంచేస్తున్నారు.

1:3 చొప్పున షార్ట్ లిస్ట్

ఆర్టీఐ ప్రధాన కమిషనర్, ఆరు కమిషనర్ పోస్టుల కోసం 1:3 చొప్పున షార్ట్ లిస్ట్‌ను తయారుచేశారు. నియామక విషయంలో ప్రక్రియ కొనసాగుతున్నదని ప్రభు త్వం కోర్టుకు కూడా నివేదించింది. కమిషనర్ల నియామకానికి హైకోర్టు విధించిన గడువు పూర్తయింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో కంటెప్ట్ ఆఫ్ కోర్టుకు వెళ్లేందుకు ప్రజాసంఘాలు సిద్ధం అవుతున్నట్టు సమాచారం.

ఏడు పదవుల కోసం 750 మంది పోటీ

హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రభుత్వాలను ఆదేశించిన ఫలితంగా రాష్ట్రంలో ఆర్టీఐ కమిషన్ ఏర్పాటుకు జూన్ 12న నోటిఫికేషన్ జారీచేసింది. అదేనెల 29 వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చింది. సుమారు 400కు పైగా దరఖాస్తులు వచ్చాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జూలైలో జారీచేయగా 350 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. పాత, కొత్త దరఖాస్తులన్నీ కలిపి 750 మందికి పైచిలుకు ప్రధాన కమిషనర్, ఆరు కమిషనర్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. వీరిలో సుమారు 55 మందికిపైగా రిటైర్ట్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు ఉన్నారు.

గ్రీన్ ఎనర్జీ పాలసీపై 3న సమావేశం: భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): గ్రీన్ ఎనర్జీ పాలసీపై వచ్చే నెల 3న సమావేశం నిర్వహించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హెచ్‌ఐసీసీలో జరుగనున్న ఈ సమావేశంలో భాగస్వామ్య సంస్థలు, ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. హరిత ఇంధనాన్ని ప్రోత్సహించడానికే గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకువస్తున్నామని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

యాదలక్ష్మితో మాట్లాడుతున్న రిలేషన్స్ కమిటీ సభ్యులు

హెర్బల్ మందు పేరుతో మోసపోయిన మహిళ

వికటించడంతో ఎంజీఎం దవాఖానలో చికిత్స

కరీమాబాద్, డిసెంబర్ 25: మూర్ఛ జబ్బుకు అల్లోపతి అవసరం లేదని, హెర్బల్ మందు చాలని చెప్పడంతో నమ్మిన ఓ మహిళ ప్రాణాపాయస్థితిలోకి వెళ్లింది. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోజెరువుకు చెందిన యాదలక్ష్మి కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నది. డాక్టర్ల సలహాలు, సూచనలతో అల్లోపతి వైద్యం తీసుకుంటున్నది. ఈ నెల 16న ఓ మహిళ యాదలక్ష్మి ఇంటికి వచ్చి మూర్ఛ వ్యాధికి హెర్బల్ మందు వాడితే 15 రోజుల్లో పూర్తిగా నయమవుతుందని తెలిపింది. మహిళ మాటలను నమ్మిన యాదలక్ష్మి హెర్బల్ మందులను వాడుతూ ఈ నెల 19న ఇంటిలో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎం దవాఖానకు తరలించగా హెర్బల్ మందు విషయం వెలుగులోకి వచ్చింది. బంధువులు ఈ విషయాన్ని తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్స్ కమిటీకి ఫిర్యాదు చేశారు. వారు యాదలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకుని, హెర్బల్ మం దులు వాడడం వల్ల కిడ్నీ, లివర్ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సదరు మహిళ కవితపై చెన్నారావుపేట పోలీసులకు బాధిత మహిళ బంధువులు, డాక్టర్లు ఫిర్యాదు చేశారు.

కుర్దు మిలిటెంట్స్‌పై టర్కీ భీకర దాడులు

21మంది హతమైనట్టు ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: సిరియా, ఇరాక్ సరిహద్దులోని కుర్దు ఉగ్రవాద ప్రాంతాలపై టర్కీ భీకర దాడులకు దిగింది. 21 మంది కుర్దిష్ మిలిటెంట్స్‌ను అంతమొందించినట్టు టర్కీ మిలటరీ బుధవారం ప్రకటనలో తెలిపింది. మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అస్సద్ దేశాన్ని వీడి వెళ్లిపోయిన దగ్గర్నుంచి ఉత్తర సిరియాపై టర్కీ పెద్ద ఎత్తున మిలటరీ ఆపరేషన్స్‌ను చేపడుతున్నది. తాజాగా చేపట్టిన వైమానిక దాడుల్లో కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ(పీకేకే)కి చెందిన 20 మంది, ఉత్తర ఇరాక్‌లోని కుర్దిష్ వైపీజీ మిలిటెంట్ ఒకరు చనిపోయినట్టు టర్కీ మిలటరీ పేర్కొన్నది. ఇరు దేశాల సరిహద్దుల్లో కుర్దిష్ మిలిటెంట్స్ లక్ష్యంగా మిలటరీ ఆపరేషన్స్ కొనసాగుతాయని తెలిపింది. సిరియాలో అస్సద్ కు వ్యతిరేకంగా అమెరికా ఏర్పాటు చేసిన మిలిటెంట్ గ్రూప్ 'వైపీజీ'. దీనిని సిరియాలో లేకుండా చేయాలన్న పట్టుదలతో టర్కీ మిలటరీ ఆపరేషన్స్‌ను చేపడుతున్నది.

హిజ్రాతో కొడుకు ప్రేమ వ్యవహారం

అవమానంతో తల్లిదండ్రులు ఆత్మహత్య

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ) : ఏపీలోని నంద్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. కన్నకొడుకు ఓ హిజ్రాతో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తుండడంతో మనస్తాపానికి గురై తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. నంద్యాలలోని ఎస్బీఐ కాలనీకి చెందిన సుబ్బరాయుడు, సరస్వతి దంపతుల కుమారుడు సునీల్ బీటెక్ ఫస్టియర్ ఫెయిలై హిజ్రాలతో కలసి తిరుగున్నాడు. ఓ హిజ్రాతో కొనసాగిస్తున్న ప్రేమ వ్యవహారాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడిని మందలించారు. దీంతో హిజ్రాలు సుబ్బరాయుడు దంపతులు నడుపుతున్న దుకాణం వద్దకు వచ్చి అసభ్యకరంగా వ్యవహరించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, కుమారుడు తన వైఖరిని మార్చుకోకపోవడంతో మనస్తాపానికి గురై తల్లిదండ్రులిద్దరూ పురుగు మందు తాగగా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

గ్రామీణ అక్షరాస్యతలో పూర్

- కింది నుంచి రెండో స్థానంలో తెలంగాణ
- మన కన్నా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్
- పురుషులు కాస్త నయం.. మహిళలు అధ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): గ్రామీణ మహిళల అక్షరాస్యతలో తెలుగు రాష్ట్రాలు అట్టడుగున నిలిచాయి. బీహార్, ఛత్తీస్‌గఢ్ కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వెనుకబడ్డాయి. 2023-24 సంవత్సరంలో ఏపీ కింది నుంచి మొదటి స్థానంలో, తెలంగాణ కింది నుంచి రెండో స్థానంలో ఉన్నాయి. మొత్తం గ్రామీణ అక్షరాస్యత రేటు విషయంలోనూ తెలంగాణ, ఏపీ కింది నుంచి వరుసగా మొదటి, రెండో స్థానంలో నిలిచినట్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశమంతా డిజిటల్ లిటరసీ వైపు పరుగులు తీస్తుంటే అక్షరాస్యత రేటు విషయంలో తెలుగు రాష్ట్రాలు వెనుకబడటం ఆందోళన కలిగిస్తున్నది. అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రం న్యూ ఇండియా లిటరీస్ ప్రోగ్రామ్‌ను చేపట్టింది. పలు ఆశావహ జిల్లాలను గుర్తించి ఈ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నప్పటికీ ఫలితాలు రావడం లేదు.

కేంద్రం వివరాలు ఇవీ..

- తెలంగాణలో గ్రామీణ మహిళల అక్షరాస్యత రేటు ఏడాది వ్యవధిలోనే 4% తగ్గింది. 2022-23లో 65.9 శాతంగా ఉన్న ఈ రేటు.. 2023-24లో 61.1 శాతానికి పడిపోయింది.
- తెలంగాణలో గ్రామీణ పురుషుల అక్షరాస్యత రేటులో ఎలాంటి మార్పులేదు. 2022-23తోపాటు 2023-24లోనూ 79.3 శాతంగా నమోదైంది.
- 2022-23లో తెలంగాణలో 72.6 శాతంగా ఉన్న గ్రామీణ అక్షరాస్యత రేటు 2023-24లో 69.9 శాతానికి దిగజారింది. ఇది జాతీయ సగటు 77.5% కంటే చాలా తక్కువ. ఇదే సమయంలో ఏపీలో గ్రామీణ అక్షరాస్యత రేటు 67.6 నుంచి 67.5 శాతానికి తగ్గింది.

2023-24లో గ్రామీణ అక్షరాస్యత శాతాలు

రాష్ట్రం	పురుషులు	మహిళలు	మొత్తం
ఛత్తీస్‌గఢ్	85	68.2	76.6
బీహార్	81.1	65	73.3
రాజస్థాన్	83.6	61.8	72.5
మధ్యప్రదేశ్	80	62.6	71.6
తెలంగాణ	79.3	61.1	69.2
ఆంధ్రప్రదేశ్	74.4	60.9	67.5

కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

- న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల ఆందోళన
- ఏకశిల జూనియర్ కాలేజీ గర్ల్స్ క్యాంపస్ వద్ద ఉద్రిక్తత

హనుమకొండలోని ఏకశిల జూనియర్ కాలేజీ గర్ల్స్ క్యాంపస్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని కుటుంబీకులు, విద్యార్థి సంఘం నేతలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 25: హనుమకొండలోని ఏకశిల జూనియర్ కాలేజీ హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల క్యాంపస్ వద్ద ఆందోళనలు చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాంధన్‌తండాకు చెందిన గుగులోత్ శ్రీదేవి (16) హనుమకొండ డబ్బాల ప్రాంతంలోని ఏకశిల గర్ల్స్ క్యాంపస్‌లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. మంగళవారం రాత్రి 9 గంటలకు కాలేజీ హాస్టల్‌లో ఉరివేసుకోగా గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. వారు శ్రీదేవిని ఎంజీఎం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాలేజీ యాజమాన్యం వేధింపులే మృతికి కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు అర్ధరాత్రి మృతదేహంతో కాలేజీ ఎదుట బైఠాయించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేయూ, సుబేదారి, హనుమకొండ పోలీసుల బలగాలతో పహరా నిర్వహించారు. బుధవారం బాయ్స్ క్యాంపస్ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ క్యాంపస్‌పై రాళ్లు వేయడంతో కిటికీ అద్దాలు పగిలిపోయాయి. దీంతో కేయూ పోలీసులు వారిపై లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. అక్కడి నుంచి గర్ల్స్ క్యాంపస్‌కు చేరుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి ఏకశిల కాలేజీ అనుమతులను రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే నగరంలోని ప్రైవేట్ కాలేజీల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. శ్రీదేవి మృతిపై సమగ్ర విచారణ జరిపి కాలేజీ యాజమాన్యం, కరస్పాండెంట్ గౌరు తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు కాజీపేట ఏసీపీ తిరుమల్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్‌ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ మానసిక ఒత్తిళ్లకు గురిచేయడంతో ఇంటర్ విద్యార్థిని శ్రీదేవి కాలేజీలో ఉరివేసుకుందని పేర్కొన్నారు. శ్రీదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హాస్టల్ గదిలో ఉరివేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎస్సై, మహిళా కానిస్టేబుల్ అదృశ్యం!

- అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు కట్టపై కారు, ఫోన్లు లభ్యం
- కొనసాగుతున్న గాలింపు

రామారెడ్డి, డిసెంబర్ 25 : కామారెడ్డి జిల్లా పోలీసుశాఖలో బుధవారం రాత్రి కలకలం రేగింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట మహిళా కానిస్టేబుల్ శ్రుతి అదృశ్యం కావడం, వారి సెల్‌ఫోన్లు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు కట్టపై లభ్యం కావడంతో అక్కడ పోలీసులు గాలిస్తున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో ఉన్నట్టు గుర్తించి అక్కడకు వెళ్లారు. చెరువుకట్టపై ఎస్సై సొంత కారుతో పాటు ఫోన్లు, చెప్పులు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతితోపాటు బీబీపేట పీఏసీఎస్‌లో కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌గా గుర్తించారు. గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్పీ సింధూశర్మ చెరువు వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నది. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ గతంలో బీబీపేట ఎస్సైగా పని చేసి, బదిలీపై భిక్కనూరుకు వచ్చారు. బీబీపేటలో పని చేసిన సమయంలో వీరికి పరిచయం ఏర్పడిందని భావిస్తున్నారు.

మహిళా హోంగార్డు బ్లాక్‌మెయిలింగ్

- మూడు జిల్లాల్లో కోటి దాకా వసూలు
- ఎనిమిదికి పైగా కేసులు

వేములవాడ, డిసెంబర్ 25: సాన్నిహిత్యంగా మెలుగుతూ, బ్లాక్ మెయిల్ చేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆర్థికంగా ఉన్న పలువురి నుంచి ఓ కిలేడీ కోటి దాకా లూటీ చేసిన ఘటన సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ వ్యవహరించిన తీరు ఆ శాఖకే కళంకం తెచ్చిపెట్టింది. వివరాల్లోకి వెళితే.. సదరు మహిళ వేములవాడలో హోంగార్డుగా పనిచేస్తుండగా రాజన్న ఆలయ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన శేఖర్‌తో పరిచయం పెంచుకున్నది. తన భర్త ఆరోగ్యం బాగాలేదని అతని నుంచి 5లక్షలు వసూలు చేసింది. డబ్బులు తిరిగి అడగ్గానే శేఖర్ ఫొటోలు మార్పిడి చేసి బ్లాక్ మెయిల్ చేయగా, వేములవాడ ఠాణాలో 5న కేసు నమోదైంది. వేములవాడరూరల్ మండలం అనుపురానికి చెందిన పరశురామ్‌తో పరిచయం పెంచుకొని 45 లక్షలు కాజేసింది. పరశురాం అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో ఇద్దరు న్యాయవాదులు కలిసి ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ 15 లక్షలు డిమాండ్ చేసింది. వేములవాడ ఠాణా, హైదరాబాద్‌లో 3న కేసు నమోదైంది. మరో ఘటనలో వేములవాడలోని సుభాష్‌నగర్‌లో సుజాతతో ఆమె మహిళా కానిస్టేబుల్‌గా పరిచయం చేసుకున్నది. ఖరీదైన కార్లలో ఆమె దగ్గరికి వస్తూ, అప్పుడప్పుడూ షాపులో ఉద్దెర పెడుతూ రూ.9లక్షల అప్పు తీసుకున్నది. డబ్బులు అడిగితే రేపు మాపు అంటూ ముఖం చాటేయడంతో బాధితురాలు ఈ నెల 11న వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు జిల్లాల్లో ఫిర్యాదులు..

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఆమెపై 8 కేసులు నమోదైనట్టు పోలీస్ శాఖ ద్వారా తెలిసింది. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లోనే నాలుగు కేసులు ఉండగా, జగిత్యాలలో రెండు, కరీంనగర్‌లో రెండు ఫిర్యాదులు పోలీసులకు అందినట్టు సమాచారం. అవసరమైతే వల, లేదంటే బ్లాక్ మెయిల్ చేస్తూ వచ్చిన కిలేడీ దోపిడీ వ్యవహారం ఇటీవలే బయటికి రాగా, బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తుండడం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపుతున్నది.

ఏపీలో ఇంటర్ ఫీజు గడువు 31వరకు పొడిగింపు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ): ఏపీలో ఇంటర్ పరీక్ష ఫీజును ఈనెల 31 వరకు తత్కాల్ పథకం కింద చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతికాశుక్లా తెలిపారు. గతంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు అపరాధ రుసుముతో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు విడివిడిగా 3వేల చొప్పున చెల్లించాలని ఆమె సూచించారు. ఫీజుకు సంబంధించి ఇక ఎలాంటి పొడిగింపు ఉండదన్నారు.

పెళ్లికి నిరాకరించిందని ఘాతుకం

- కత్తితో దాడి చేసిన యువకుడు
- చావుబతుకుల్లో యువతి
- మలక్‌పేట పరిధి శాలివాహననగర్‌లో దారుణం

నిందితుడు వెంకట దుర్గాప్రసాద్

మలక్‌పేట, డిసెంబర్ 25 : పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో యువతిపై కత్తితో దాడికి తెగబడ్డాడో ఉన్మాది. కుటుంబసభ్యులు అడ్డుపడ్డా వదలకుండా దాడిచేయడంతో గాయాలపాలై ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి మూసారాంబాగ్ శాలివాహననగర్‌లో మంగళవారం దారుణం జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా విజయవాడ కానూర్‌కు చెందిన పోతన వెంకట దుర్గాప్రసాద్(32) శాలివాహననగర్‌లో ఉంటూ ఓ కారు వాష్ షో రూంలో పనిచేస్తున్నాడు. తన ఇంటి పక్కనే వంటమనిషి యాదమ్మ తన ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో కలిసి ఉంటున్నది. యాదమ్మకు భర్త లేకపోవటంతో అప్పుడప్పుడు కూరగాయలు, సరుకులు తెచ్చిస్తూ వారితో దుర్గాప్రసాద్ సాన్నిహిత్యం పెంచుకున్నాడు. పెద్ద కూతురు విజయలక్ష్మి(24)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుందామని దుర్గాప్రసాద్ అడగగా ఇద్దరి కులాలు వేర్వేరు కావటంతో ఆమె నిరాకరించింది. తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపేస్తానని దుర్గాప్రసాద్ బెదిరిస్తూ వచ్చాడు. 20 రోజులుగా యువతి దూరంగా ఉంటుడడంతో మరింత కోపం పెంచుకున్న దుర్గాప్రసాద్, మంగళవారం డాబాపై బట్టలు ఆరేసేందుకు ఆమె వెళ్లడం గమనించి టెర్రస్ పైకి వెళ్లి కత్తితో ఒక్కసారిగా దాడిచేశాడు. అరుపులు విన్న తల్లి, సోదరి, సోదరుడు వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఆగకుండా గొంతు, పొట్ట, చేతులపై దాడిచేయడంతో యువతి గాయపడింది. ఇరుగు పొరుగువారు 100కు ఫోన్‌చేయగా.. మలక్‌పేట పోలీసులు చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని యువతిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. దుర్గాప్రసాద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యారంగంలో సర్కారు తప్పటడుగు!

పేద విద్యార్థులకు దిక్సూచిగా సీవోఈలు

వేలాది మెడికల్, ఇంజినీరింగ్ ర్యాంకులు

- గురుకుల బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తింపు
- సీవోఈల నిర్వీర్యానికి కుట్ర పన్నిందెవరు?
- ఈ ఏడాది నుంచి అడ్మిషన్లకు కొత్త విధానం
- గతంలో విఫలమైన పద్ధతిలో మళ్లీ ప్రవేశాలు
- బడుగు, బలహీన విద్యార్థులకు అన్యాయం
- ప్రభుత్వ నిర్ణయంపై విద్యావేత్తల అభ్యంతరం

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని పదే పదే చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా మరో నిర్ణయం తీసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన గురుకుల సొసైటీ పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల నిర్వీర్యానికి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ సర్కారు పైకొకటి చెబుతూ తెరవెనక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీవోఈల్లోని సబ్జెక్టు అసోసియేట్లను తొలగించేందుకు ప్రయత్నించింది. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. ఇప్పుడు సీవోఈల్లో ప్రవేశాల పద్ధతిని మార్చేందుకు సిద్ధమైంది. రాత పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ కల్పించనున్నామని ఇటీవల సొసైటీ సెక్రటరీ వర్షిణి వెల్లడించారు. అలా జరిగితే సీవోఈల లక్ష్యమే పూర్తిగా దెబ్బతింటుందని విద్యావేత్తలు, విద్యార్థిసంఘాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటివరకు రెండు దశల్లో పరీక్ష

ఐఐటీ, మెడిసిన్ వంటి ఉన్నత విద్యాభ్యాసం పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. లక్షలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కానీ పేద బిడ్డలు ఆశయాలు సాధించేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 38 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు ఏర్పాటు చేసింది. మొత్తం 38 సెంటర్లలో 3680 సీట్లు అందుబాటులో ఉంచింది. ఏటా రెండు దశల్లో రాత పరీక్షను నిర్వహించి ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించింది. ఎంపికైన విద్యార్థులకు ఇంజినీరింగ్, మెడిసిన్, ఉన్నత సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నది. కేసీఆర్ దార్శనికత సత్ఫలితాలు ఇచ్చింది. సీవోఈల్లో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్ సీట్లు సాధించారు. రాష్ట్రంలోని గురుకుల విద్యావ్యవస్థకు సీఈవోలు బ్రాండ్ అంబాసిడర్‌లుగా నిలిచాయి.

కొత్త పద్ధతి కోసం సర్కారు చర్యలు

సీవోఈల్లో ప్రవేశానికి సంబంధించి ఇప్పటి వరకు అనుసరించిన విధానాలకు స్వస్తి పలికేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కేవలం ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని గురుకుల పాఠశాలలు చదివిన విద్యార్థులకు నేరుగా గురుకుల ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలను కల్పించనుంది. సీవోఈల్లో కూడా రాతపరీక్షకు స్వస్తి పలుకుతున్నామని, నేరుగా సొసైటీకి చెందిన గురుకులాల్లో చదివిన 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులనే చేర్చుకోనుంది. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సమావేశంలో సొసైటీ సెక్రటరీ వర్షిణి స్వయంగా వెల్లడించారు.

ప్రభుత్వ నిర్ణయం విఫల ప్రయోగం

సీవోఈలకు నేరుగా సొసైటీకి చెందిన విద్యార్థులనే ఎంపిక చేయడమంటే అదొక విఫలప్రయోగమని విద్యావేత్తలు, విద్యార్థి, సామాజిక సంఘాల నేతలు అభ్యంతరం తెలుపుతున్నారు. గత ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపేసే పంతంతో పేద విద్యార్థులకు అన్యాయం చేయడం సరికాదని చెబుతున్నారు. గురుకులాల్లో, గురుకులాలకు వెలుపల ప్రతిభ కలిగిన విద్యార్థులకు శిక్షణ అందించడమే సీఈవోల లక్ష్యంగా గత ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని గుర్తుచేస్తున్నారు. ఈ సెంటర్ల నుంచి విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలుగా ఎదిగారని చెబుతున్నారు. విజయవంతంగా సాగుతున్న సెంటర్లలో విఫలమైన విధానాలు తిరిగి తీసుకురావడం సరికాదని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమిస్తామని తేల్చిచెబుతున్నారు.